సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం : 28 : జనవరి : 2023



సారాపై సమరం

సంపూర్ణ సారా రహిత జిల్లాగా మార్పు తెచ్చేందుకు పోలీసులు, సెబ్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. సారా తయారీ కేంద్రాలపై నిఘా పెట్టి పూర్తిస్థాయిలో కట్టడి చేస్తున్నారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్స్ (10 గ్రా)	రూ.58860
22 క్యారెట్స్ (1 గ్రా) ఆభరణలు	రూ.5,257
జీఎస్టీ 3 శాతం కలిపి	రూ.5,415
బంగారం నవర (8 గ్రా)	రూ.43,320

గరిష్టం/కనిష్టం
31.6 /21.6

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా శనివారం వాతావరణం పొడి గా ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంగా కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. గాలిలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

11న జాతీయ లోక్‌అదాలత్

నెల్లూరు (లీగల్): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి, గూడూరు, కోట, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాలు, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్‌కు 198 మంది విద్యార్థులకు గాను 23 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కావలిలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్‌కు 12,386 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,026 మంది గైర్హాజరయ్యారని, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

స్టాఫ్‌నర్స్ పోస్టుల ఫైనల్ మెరిట్ జాబితా


నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ కింద ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్స్‌ల పోస్టుల భర్తీకి సంబంధించి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు ఉంచామని తెలిపారు. అభ్యర్థులు పరిశీలించుకోవాలని కోరారు.

అన్నీ ఒకేతాటిపైకి..

- ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ

నెల్లూరు (సెంట్రల్): పలు కార్పొరేట్ సంస్థలు కలిపి ఒకే తాటిపైకి తెచ్చి మార్కెటింగ్ చేసే విధంగా చేస్తున్నట్లు ఇఫ్కో జిల్లా మేనేజర్ జీఆర్ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు కార్పొరేట్ సంస్థలను ఒకే ఫ్లాట్‌ఫాంకి తెచ్చి దేశ, విదేశాల్లో మార్కెట్ చేసే విధంగా చేస్తున్నామన్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం ద్వారా సమృద్ధి అనే నినాదంతో ఎగుమతుల సహకార సంస్థలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

సోమశిలలో 69.967 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం నాటికి 69.967 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1545 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 650, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

టీడీపీ అప్పులు తీరుస్తున్నాం

గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.1,200 కోట్లు చెల్లించాం

- జిల్లా అభివృద్ధిలో పురోగతి సాధించాం
- అత్యవసర పనులు త్వరగా పూర్తి చేయండి
- పదిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు
- రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ రోణంకి కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఎగ్గొట్టిన పాత బకాయిలు రూ.1,200 కోట్లు చెల్లించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత ఇటీవల వెంకటగిరి జెడ్పీటీసీ సభ్యుడు కోలా వెంకటేశ్వర్లు మరణించడంతో సభలో రెండు నిమిషాలు మౌనంపాటించి నివాళులర్పించారు. మంత్రి కాకాణి తొలుత వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఇబ్బడి ముబ్బడిగా పనులకు అనుమతులు ఇచ్చారని, ఆ పనులకు సంబంధించి రూ.1,300 కోట్లకు పైగా నిధులు డైవర్షన్ చేశారన్నారు. గతంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉపాధి పనులకు అనుమతులు ఇచ్చారన్నారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో జిల్లాలో ఉపాధి పనులకు సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఇతర జిల్లాల్లో ఖర్చు చేశారన్నారు. ప్రస్తుతం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏ జిల్లాకు సంబంధించిన నిధులు అక్కడే ఖర్చు చేసుకునే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.1,280 కోట్లు విడుదల చేయనుందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. యూరియా కొరత లేదని, యూరియాను బఫర్‌స్టాక్ పెట్టి సరఫరా చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న నెల్లూరు, మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీల నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. రైతులకు మద్దతు ధర లభించేలా ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను పరిశీలించి సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నాడు–నేడు ద్వారా రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. మొదటి విడత పనులు పూర్తి చేసి రెండో విడతలో పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేలా విద్యార్థులకు విజయ దీపిక బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి అత్యవసర పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారం తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీలు సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేసిన తర్వాత నిధులు ఖర్చు చేయాలన్నారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హుల దరి చేర్చేలా జెడ్పీటీసీలు, ఎంపీపీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు ఎన్నికలు సజావుగా నిర్వహించి గవర్నర్ నుంచి అవార్డులు అందుకున్న కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, గత జేసీ హరేందిరప్రసాద్‌లకు జెడ్పీ తరపున అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జేసీ రోణంకి కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, ఎమ్మెల్సీవాకాటి నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ భవనానికి చంద్రశేఖర్‌రెడ్డి పేరు

- తీర్మానించిన చైర్‌పర్సన్



దివంగత నల్లపరెడ్డి చంద్రశేఖరెడ్డి (ఫైల్)

జిల్లా పరిషత్ నూతన భవనానికి జెడ్పీ మాజీ చైర్మన్, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరు పెట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. చైర్‌పర్సన్ తీర్మానానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 1962–70 వరకు జెడ్పీ చైర్మన్‌గా, అంతకు ముందు 1960–62 మధ్య కాలంలో జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 1983లో వెంకటగిరి ఎమ్మెల్యేగా పనిచేశారు. 1983–89 మధ్య కాలంలో పీఆర్ చాంబర్ అధ్యక్షుడిగా, 1994లో ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా ఉన్న కాలంలో 450 పాఠశాలలు నిర్మించారు. 7 వేల మందికిపై ఉద్యోగావకాశాలు కల్పించారు. ఆయన చేసిన సేవలకు జెడ్పీ భవనానికి నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరు పెట్టాలని తీర్మానించారు. జెడ్పీలో తీర్మానంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నేదురుమల్లి వినోద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.40.52 కోట్ల మిగులు బడ్జెట్

జిల్లా పరిషత్‌కు సంబంధించి రూ.40,52,74,140 మిగులు బడ్జెట్‌తో అంచనాలు సిద్ధం చేసి సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో బడ్జెట్ అంచనాలు సభ్యుల ముందు ఉంచి ఆమోదం తెలియజేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాలతో రూ.338,15,36,040 ఆదాయం, ఖర్చు రూ.307,47,70,300 కాగా, 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.366,89,65,440 ఆదాయంగా, ఖర్చు రూ.326,36,91,300 చూపించారు. రూ.40,52,74,140 మిగులు బడ్జెట్‌తో అంచనాలు రూపొందించారు.

ఆరోగ్యశ్రీ సేవలు బాగు



అన్ని నియోజకవర్గాల్లో ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి. ఎవరూ కూడా సేవలు అందడం లేదని నా దృష్టికి తీసుకురాలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయి.
– వి.వరప్రసాద్‌రావు, గూడూరు ఎమ్మెల్యే

నోటిఫికేషన్లపై సమాచారం ఇవ్వండి



ఆరోగ్యశాఖకు సంబంధించి ఉద్యోగుల భర్తీ చేసే సమయంలో నోటిఫికేషన్ల సమాచారం తెలియజేయండి. సమస్యలపై కలెక్టర్ సైతం వెంటనే స్పందిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించడం లేదు.
– బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్సీ

ఆరోగ్యశాఖకు గుండె ధైర్యం



వైద్య ఆరోగ్యశాఖకు గుండె ధైర్యం ఎక్కువ. ఎదురుగా ఎవరు ఉన్నారనేది చూడకుండా తప్పుడు సమాధానం చెబుతున్నారు. జిల్లాలో ఇంటి వద్ద ఒక్క కాన్పు కూడా జరగలేదని తప్పుడు నివేదికలు ఇచ్చారు. యానాదులు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయంపై అనేక పర్యాయాలు చర్చించిన ఫలితం లేదు.
– విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ

సబ్జెక్ట్ టీచర్ల సర్దుబాటు



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

37 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధనకు ఆటంకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఓ వైపు పరీక్షలు దగ్గర పడుతుండడం, మరో వైపు బదిలీల వ్యవహారం కోర్టులో ఉండడంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతకు చెక్ పెట్టే విధంగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. మిగులు పాఠశాలల నుంచి సబ్జెక్ట్ ఉపాధ్యాయులను తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబాటుకు శ్రీకారం చుట్టింది.

- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నియామకం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 600 మంది సర్దుబాటు
- కేటాయించిన పాఠశాలల్లో వెంటనే చేరాలన్న డీఈఓ
- బదిలీలు జరిగే వరకు ఆ పాఠశాలల్లోనే విధులు

నెల్లూరు (టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 600 మంది సబ్జెక్ట్ టీచర్ల కొరత వెంటాడుతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే బదిలీ ప్రక్రియ వ్యవహారం కోర్టులో ఉంది. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడం, ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 600 మంది ఉపాధ్యాయులను తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. సర్‌ప్లస్ ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో వెంటనే విధుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి డీఈఓ, ఏడీ–1 గ్లోరికుమారి ఎంఈఓలకు జాయినింగ్ ఆర్డర్లు జారీ చేశారు. జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 499 మంది ఉపాధ్యాయులు సర్‌ప్లస్ ఉన్నట్లు లెక్కలు తేల్చారు. వీరిలో మ్యాథ్స్ 88, ఫిజికల్ సైన్స్ 47, బయాలజికల్ సైన్స్ 65, సోషల్ 91, ఇంగ్లిష్ 58, తెలుగు 81, హిందీ 69 మంది ఉన్నారు. ఇతర సబ్జెక్ట్‌ల స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 32 మందిని మ్యాథ్‌కు, 15 మందిని ఇంగ్లిష్‌కు కన్వర్షన్ చేశారు. వీరితో పాటు ఆయా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తున్న 37 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి వారిని ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు ఆయా పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. మరో 17 మంది సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆయా పాఠశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు కేటాయించారు. ఈ రీతిలో జిల్లా వ్యాప్తంగా 600 మంది టీచర్లను ఆయా పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించిన 37 మంది, సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లగా పనిచేస్తూ సబ్జెక్ట్ టీచర్లగా సర్దుబాటు చేసిన 17 మందికి వారి జీతంతో పాటు అదనంగా ప్రతి నెలా రూ.2,500 ఇవ్వనున్నారు.

వెంటనే విధుల్లో చేరాలి

ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు వెంటనే పనిచేస్తున్న పాఠశాలల్లో రిలీవ్ అయి కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆయా మండల విద్యాశాఖ అధికారులకు ఏడీ–1, ఇన్‌చార్జి డీఈఓ గ్లోరీ కుమారి జాయినింగ్ ఆర్డర్లు పంపించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే విధంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

పది ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు



విజయదీపిక బుక్స్‌ను ఆవిష్కరించిన మంత్రి కాకాణి, ఆనం అరుణమ్మ

- విజయ దీపిక ఆవిష్కరణ

నెల్లూరు(పొగతోట): జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో 10వ తరగతి విద్యార్థులకు అందజేయనున్న విజయ దీపిక బుక్స్‌ను చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోవిడ్ వల్ల 10వ తరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాను విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ 318 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 15,200 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారన్నారు. విద్యార్థులందరికీ విజయ దీపిక బుక్స్ పంపిణీ చేస్తామని వెల్లడించారు. విజయదీపికను పూర్తిస్థాయిలో చదివితే విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయడంలో ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, వివిధ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా అభివృద్ధి

- రైల్వే ఏజీఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏజీఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): రైల్వే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఉండే విధంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికుల సౌకర్యాలు కోసం అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు నాణ్యతతో కూడిన విధంగా చేపడుతున్నామని, ఆ పనుల పరిశీలన కోసం నెల్లూరుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

సింహపురి నుంచి జమున సినీ ప్రస్థానం

- తొలి సినిమా 'పుట్టిల్లు'
- నిర్మాతలు నెల్లూరు వాసులు



పుట్టిల్లు నిర్మాత తనయుడు ఎన్.కుమార్‌సింగ్



పుట్టిల్లు వాల్‌పోస్టర్



నెల్లూరు నగరంలోని పాతమున్సిపల్ కార్యాలయం సమీపంలో అప్పట్లో పుట్టిల్లు నిర్మాత ఉన్న గృహం (ఫైల్)

నెల్లూరు (బారకాసు): ఎందరో సినీ కళాకారుల పురిటిగడ్డ సింహపురి. ఇక్కడి నుంచే సినీ ప్రస్థానం ప్రారంభించి చలనచిత్ర రంగానికే వన్నె తెచ్చారు. నెల్లూరుకు చెందిన అనేక మంది కళాకారులు తమ ప్రతిభతో తెలుగు సినీరంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సినీరంగంలో కేవలం తెరపై పాత్రలు పోషించడంలోనే కాకుండా దర్శకత్వం, గాయకులుగా, గేయ రచయిత, నిర్మాత ఇలా అనేక రంగాల్లో తమ ప్రతిభను చాటిన వారు ఉన్నారు. వీరిలో రమణారెడ్డి, పద్మనాభం, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, వెన్నెలకంటి, కేఎస్‌ఆర్ దాస్, ఏఎంరత్నం, రంజిత్‌రామ్‌దేవ్‌సింగ్, నెల్లూరు కాంతారావు వంటి మహామహులు తెలుగు సినిమా తెరను ద్విగుణీకృతం చేసినవారే.

'పుట్టిల్లు' పుట్టింది ఇక్కడే

సినీనటిగా జమున నటించిన తొలిసినిమా పేరు పుట్టిల్లు. ఈ సినిమాకు నెల్లూరీయులే నిర్మాతలు కావడంతో జమున ప్రస్థానం నెల్లూరు నుంచే ప్రారంభమైందని ఆ నాటితరం చెప్పుకునేవారు. పుట్టిల్లు నిర్మాతలు రంజిత్‌రామ్‌దేవ్‌సింగ్, రంజిత్ యుగంధర్‌సింగ్ నెల్లూరు నగరంలోని పాతమున్సిపల్ కార్యాలయ సమీపంలో నివాసం ఉండేవారు. ఆధ్యాత్మికం, కళలపై వీరికి ఆసక్తి ఎక్కువ. స్నేహితులతో కలిసి నాటకాలు వేయించేవారు. అప్పుడప్పుడే సినిమా కళ వైపు అడుగులు పడుతున్న క్రమంలో సినిమా తీయాలని సింగ్ సోదరులు తలపెట్టారు. ఆ నాటి సినీ ప్రవేశానికి సంబంధించి జరిగిన విషయాలను నిర్మాత రంజిత్‌రామ్‌దేవ్‌సింగ్ తనయుడు ఎన్.కుమార్‌సింగ్ 'సాక్షి'కి తెలిపారు.

పుట్టిల్లు సినిమా సందేశాత్మకం : ఎన్.కుమార్‌సింగ్

అప్పుడున్న పరిస్థితుల్లో సినిమా ద్వారా ఒక సందేశం సమాజానికి ఇచ్చేవారు. అప్పట్లో ఆడవారు సినిమాల్లో నటించాలంటే అనేక ఇబ్బందులుండేవి. మానాన్న, చిన్నాన్న నిర్మాతలుగా ఈ సినిమాను తీసినప్పటికీ, దీనికి ఎంతో మంది సహకారం ఉంది. ఈ సినిమా హీరో గరికిపాటి రాజారావు ప్రజానాట్య మండలి వ్యవస్థాపకుడు. ఈ సినిమాకు నెల్లూరు ప్రజావైద్యశాల వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి ఎంతో సహకారం అందించారు. నెల్లూరుకు చెందిన సినీదర్శకుడు కేఎస్‌ఆర్‌దాస్, మేకప్ కళాకారుడు రాజుతో పాటు మరి కొందరు వామపక్ష భావజాలంతో సోవియట్ లాండ్ ఆర్గనైజేషన్‌ను అప్పట్లో చెన్నైలో ఏర్పాటు చేశారు. నెల్లూరుకు వచ్చినప్పుడల్లా మా ఇంట్లోనే చర్చలు, సమావేశాలు జరిగేవి. పుట్టిల్లు సినిమా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సమాజాన్ని చైతన్య పరి చేవిధంగా చేసిన కథ. పుట్టిల్లు సినిమా 1953లో నెల్లూరు నగరంలోని శేషమహాల్‌లో విడుదలైంది. సినిమాను ప్రేక్షలు ఆదరిస్తున్నప్పటికీ ఈ చిత్రం ప్రభుత్వానికి వ్యతిరేక ధోరణిలో ఉందన్న ఆలోచనతోనే అప్పటి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఆడనివ్వకుండా చేసింది. దీంతో ఈ సినిమా ఆర్థికంగా అంతగా ఉపయోగపడనప్పటికీ నటిగా జమున ప్రస్థానానికి మంచి శ్రీకారం చుట్టిందని అప్పట్లో పెద్దలు మా ఇంట్లో చర్చించుకునేవారు.

సారాపై సమరం

- తయారీదారులపై ఉక్కుపాదం
- సారా రహిత జిల్లానే లక్ష్యంగా చర్యలు
- గ్రీన్‌జోన్‌గా తొమ్మిది ప్రాంతాలు
- ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతున్న ప్రభుత్వం
- త్వరలో మరో 15 మందికి రుణాలు

నెల్లూరును సారా రహిత జిల్లాగా మార్చేందుకు సెబ్ యంత్రాంగం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ పరివర్తన్ 2.0లో భాగంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. దాడులు నిర్వహించి బెల్లంఊటను స్వాధీనం చేసుకుని పారబోశారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తయారీదారులకు ఉపాధి మార్గాలను చూపుతున్నారు. తాజాగా తొమ్మిది ప్రాంతాలను గ్రీన్‌జోన్లుగా ప్రకటించారు.

నెల్లూరు(క్రైమ్): నాటుసారాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. సెబ్, పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా ఎస్పీ సీహెచ్ విజయారావు పర్యవేక్షణలో జిల్లా సెబ్ అధికారి కె.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు సారా తయారీ, విక్రయాలు, అక్రమరవాణా అధికంగా జరిగే పది ప్రాంతాలను గుర్తించారు. వాటిలో ఏ కేటగిరీ–1, బీ కేటగిరీ–5, సీ కేటగిరీ–4గా విభజించారు. స్థానిక పోలీసులు, సెబ్, మహిళా పోలీసులు, వలంటీర్లతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి దాడులు చేశారు. పెద్దఎత్తున నిందితులను అరెస్ట్ చేశారు.


అటవీ ప్రాంతంలో బెల్లంఊటను పారబోస్తున్న సెబ్ అధికారులు (ఫైల్)

పీడీ యాక్ట్ ప్రయోగం

సారా తయారీ, విక్రయాలకు పాల్పడుతూ పదే పదే పట్టుబడుతున్న నిందితుల జాబితాను తయారు చేసి వారిని తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేస్తున్నారు. తీరుమారని వారిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తున్నారు. గతేడాది కావలి సెబ్ స్టేషన్ పరిధిలోని ముగ్గురిపై ఈ యాక్ట్‌ను ప్రయోగించారు.

జిల్లాలో..

గతేడాది నమోదు చేసిన కేసులు : 352	ఎంతమందిని అరెస్ట్ చేశారంటే.. 244 మంది
సీజ్ చేసిన సారా : 1,527.8 లీటర్లు	
ధ్వంసం చేసిన బెల్లంఊట : 1,06,858 లీటర్లు	
స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం : 625 కేజీలు	
సీజ్ చేసిన వాహనాలు : 19	బైండోవర్ కేసులు : 83

మరికొందరికి రుణాలు

ఆపరేషన్ పరివర్తన్ 2.0లో భాగంగా సారా తయారీ, విక్రయదారులు, దానిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కప్పరాళ్లతిప్ప ప్రాంతంలో 86 కుటుంబాలు సారా తయారు చేస్తున్నాయని వారికి ఉపాధి చూపితే ఆ పనులు నిలిపివేస్తారన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గేదెలు, గొర్రెలు ఇవ్వడం, కిరాణా దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు తదితరాలు ఏర్పాటు చేసేందుకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా తొలివిడత కింద 24 కుటుంబాలకు రూ.21.95 లక్షల రుణం అందజేశారు. మరో 15 కుటుంబాలకు రుణాలివ్వనున్నారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. మొత్తంగా జిల్లాను సారా రహితంగా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

ఎక్కడంటే..?


నాటుసారాను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు (ఫైల్)

కావలి సెబ్ స్టేషన్ పరిధిలోని కప్పరాళ్ల తిప్ప, కోవూరు సెబ్ స్టేషన్ పరిధిలోని అల్లూరు మండలం మూర్తిరాజుపాళెం గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం స్టేషన్ పరిధిలోని పెరమన, ఆత్మకూరు స్టేషన్ పరిధిలోని బట్టేపాడు, ఏఎస్‌పేట మండలం గుడిపాడు, కందుకూరు స్టేషన్ పరిధిలోని గుడ్లూరు మండలం నరసాపురం గ్రామంలో, నెల్లూరు–2 స్టేషన్ పరిధిలోని మనుబోలు మండలం గొట్లపాళెం గ్రామం, పొదలకూరు స్టేషన్ పరిధిలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి, రాపూరు మండల పరిధిలోని కలుజుగుంట ప్రాంతాల్లో సారా తయారీ, విక్రయ కేంద్రాలను గుర్తించారు. వాటిల్లో తరచూ దాడులు నిర్వహించడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించి నియంత్రించారు. వాటిలో కప్పరాళ్ల తిప్ప మినహా మిగిలిన వాటిని గ్రీన్‌జోన్‌గా ప్రకటించారు. ఈనెలాఖరుకు జిల్లాను సారారహితంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

ప్రత్యేక దృష్టి సారించాం



ఎస్పీ పర్యవేక్షణలో నాటుసారా కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాం. తయారీదారుల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు వారికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాం. త్వరలో మరో 15 మందికి రుణాలు ఇప్పించనున్నాం. మేం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ నెలాఖరుకు నాటుసారా రహిత జిల్లాగా నెల్లూరు మారుతుంది.

– కె.శ్రీలక్ష్మి, సెబ్ జిల్లా అధికారి

ఏపీ టీడీసీ లిమిటెడ్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా సతీష్‌కుమార్


సతీష్‌కుమార్

నెల్లూరు(లీగల్): ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించి స్టాండింగ్ కౌన్సిల్‌గా నెల్లూరుకు చెందిన న్యాయవాది ఈ.సతీష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఆ సంస్థకు చెందిన కేసులను ఏపీ హైకోర్టులో వాదిస్తారు. సతీష్‌కుమార్ నియామకంపై పలువురు న్యాయవాదులు శుక్రవారం హర్షం ప్రకటించారు.



ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యసేవలు

- ప్రతి రోగిని ఆత్మీయంగా పలకరించాలి
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు


సమావేశంలో పాల్గొన్న డాక్టర్ అశోక్‌బాబు తదితరులు

నెల్లూరు(అర్బన్): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యసేవలందేలా ఆరోగ్యమిత్రలు కృషి చేయాలని ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్‌బాబు సూచించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న టీమ్ లీడర్లు, ఆరోగ్యమిత్రలతో శుక్రవారం నెల్లూరులోని దర్గామిట్టలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్యశ్రీ జిల్లా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన ఆధునిక, నాణ్యమైన వైద్యం పేద రోగులందరికీ అందాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి ఆరోగ్యశ్రీకి పెద్దఎత్తున నిధులు అందజేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల రోగులకు వైద్యం, డాక్టర్లు గురించి అంతగా తెలియదన్నారు. అందువల్ల రోగి ఆస్పత్రికి రాగానే ఆరోగ్యమిత్రలు స్నేహభావంతో మెలగాలన్నారు. ఆత్మీయంగా పలకరించాలన్నారు. ఆస్పత్రికి ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని తెలపాలన్నారు. రోగి కోలుకుని డిశ్చార్జి అయ్యే సమయంలో ప్రభుత్వం ఆరోగ్య ఆసరా పథకం ద్వారా ఉచితంగా బ్యాంకు ఖాతాలో నగదు వేస్తుందన్న విషయంపై అవగాహన కల్పించాలన్నారు. విశ్రాంతి కాలంలో రోగి పనులకు వెళ్లలేడని ఆ కాలంలో ప్రభుత్వం అందించిన నగదుతో మంచి ఆహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ట్రీట్‌మెంట్ పక్కాగా అందేలా కృషి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ లేని అర్హులైన రోగులకు ఆరోగ్యమిత్రలు సీఎం సీఓ లెటర్ ఇప్పించి ఉచితంగా వైద్య సేవలందేలా చేయాలన్నారు. అనంతరం ఆరోగ్యమిత్రలతో రోగులకు అందుతున్న సేవలు, వారి సమస్యల గురించి మాట్లాడించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా మేనేజర్ మురళి, టీమ్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

- 180 ప్రాజెక్టుల ప్రదర్శనకు ఏర్పాట్లు


కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీప్యూటీ డీఈఓ

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో శని, ఆదివారాల్లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ జరుగుతుందని, దీని విజయవంతానికి కృషి చేయాలని నెల్లూరు డిప్యూటీ డీఈఓ భిక్షాలు తెలిపారు. శుక్రవారం ఆయన ఆ పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలస్థాయిలో ఎంపికైన ఐదు ప్రాజెక్టులను జిల్లాస్థాయిలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించి శనివారం ఉదయం 8 గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలన్నారు. విద్యార్థులకు వసతి, భోజన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 20 మంది హెడ్‌మాస్టర్లు, 40 మంది ఉపాధ్యాయులతో 14 కమిటీలను నియమించామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిలా సైన్స్ అధికారి శ్రీనివాసులు 97016 96180 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మురళి, శోభనాద్రి, శ్రీనివాసులు రెడ్డి, అంకయ్య, జానకిరామ్, జయమ్మ, ప్రసన్నలక్ష్మి, చలపతి, రమేష్, మల్లికార్జున, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజం కోసం కృషి

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్


మాట్లాడుతున్న వెంకటప్రసాద్

నెల్లూరు(అర్బన్): కుష్ఠు (లెప్రసీ) రహిత సమాజం కోసం వైద్యశాఖాధికారులు, సిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ సూచించారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సెక్టార్ల డీపీఎంలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై ఇటీవల కాలంలో సర్వే నిర్వహించారన్నారు. పలువురు అనుమానితులకు వైద్య పరీక్షలు చేశారన్నారు. అయితే కొంతమంది అనుమానితులు మిగిలిపోయారని, వారందరికీ కూడా త్వరగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి స్పర్శ అనే కార్యక్రమాన్ని పీహెచ్‌సీ స్థాయిలో, గ్రామస్థాయిలో నిర్వహించి ప్రజలకు కుష్ఠు లక్షణాలు, వాటి వల్ల జరిగే అనర్థాలు, చికిత్స ద్వారా పూర్తిగా కోలుకునే విధానాలు గురించి వివరించాలన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ పవిత్ర, డాక్టర్ కనకాద్రి, డాక్టర్ నరసింహులు, పీఎంఓ మల్లమ్మ, డీపీఎంఓలు పాల్గొన్నారు.

దేశాన్ని చుట్టేందుకు..

- హైదరాబాద్ వాసి సైకిల్ యాత్ర


ప్రవీణ్

ఆత్మకూరు: హైదరాబాద్‌కు చెందిన యేధుల ప్రవీణ్ అనే వ్యక్తి సైకిల్‌పై భారతదేశ యాత్రకు శ్రీకారం చుట్టాడు. డిగ్రీ పూర్తి చేసిన అతను ఈనెల 18వ తేదీన హైదరాబాద్‌లో యాత్ర ప్రారంభించాడు. శుక్రవారం ఆత్మకూరుకు చేరుకున్నాడు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరు - ముంబై రహదారి పక్కనున్న అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రవీణ్ తన యాత్ర గురించి విలేకరులతో తెలిపాడు. ఎనిమిది నెలలపాటు దేశంలోని రాష్ట్రాలు తిరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు చెప్పాడు. దేశసమైక్యతను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతానన్నారు. కొందరు దాతలు తన ప్రయాణానికి సహకరించినట్లు తెలిపాడు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 111
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 196
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.23
సన్నవి	: రూ.10
పండ్లు	: రూ.5